

ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి బోనాల జాతర ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ విశ్వనాథ్‌గౌడ్ తదితరులు

బోనాల ఉత్సవాలకు ఎమ్మెల్సీకి ఆహ్వానం

చంపాపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని పోచమ్మ ఆలయంలో ఈ నెల 25 నుంచి 28 వరకు కొనసాగనున్న బోనాల జాతరకు విచ్చేయాలని కోరుతూ ఆలయ కమిటీ చైర్మన్ ఎరుకల విశ్వనాథ్‌గౌడ్, కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి పట్నం సునీతామహేందర్‌రెడ్డిలకు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు ఈపూరి బద్రీనాథ్, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.



వినాయకనగర్ కాలనీలో వర్షానికి పాడైన రోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నరసింహారెడ్డి

రోడ్ల అభివృద్ధికి రూ.14లక్షలు మంజూరు

● మన్సూరాబాద్ కార్పొరేటర్ నరసింహారెడ్డి

హయత్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రోడ్ల అభివృద్ధికి షార్ట్ టెండర్ ద్వారా రూ.14లక్షలు మంజూరు చేయించినట్లు మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి తెలిపారు. వినాయక్‌నగర్ కాలనీలో వర్షాలకు పాడైన రోడ్లు, గ్రామ దేవతల ఆలయాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోనాల పండగను దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండడానికి, ఇటీవల కురిసిన వర్షాలకు పాడైన రోడ్లు నిర్మించేందుకు గాను షార్ట్ టెండర్ ద్వారా రూ. 14 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వినాయకనగర్‌తో పాటు అనేక కాలనీలలో రోడ్లు గుంతలమయంగా మారాయని కాలనీ ప్రజలు తన దృష్టికి తెచ్చారని చెప్పారు. వెంటనే జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరానని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నిధులు మంజూరు చేసిన జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ స్వప్న, సీతారాంకాలనీ సంక్షేమ సంఘాల నాయకులు రమణారెడ్డి, కొండల్‌రెడ్డి, సాయి, వెంకట్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, భానుగౌడ్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎల్బీనగర్ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి

ఎలివేటెడ్ ఫ్లైఓవర్ పనులకు ఎంపీ ఈటల కృషి

● బీజేపీ ఎల్బీనగర్ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి

వనస్థలిపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చింతలకుంట నుంచి ఆటోనగర్ వరకు ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ పనుల కోసం డీపీఆర్‌ను తయారు చేయించాలని కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేయడం హర్షణీయమని బీజేపీ ఎల్బీనగర్ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి అన్నారు. బుధవారం వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రంగారెడ్డి మాట్లాడారు. ఎల్బీనగర్ ప్రజల సౌకర్యార్థం ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రస్తుతం జరుగుతున్న అండర్ పాస్ బ్రిడ్జి పనులతో సుమారు వంద కాలనీల్లో రాకపోకలకు తీవ్రమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన అన్నారు. సమస్యను ఎంపీ ఈటల రాజేందర్‌కు విన్నవించగా ఆయన పార్లమెంట్‌లో ప్రస్తావించడం సంతోషంగా ఉందన్నారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు అండర్ పాస్ రహదారి పనులు కాకుండా ఎలివేటెడ్ ఫ్లైఓవర్ నిర్మిస్తే వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, క్రాంతిగౌడ్, రాజేశ్‌చౌదరి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఘటాల ఊరేగింపు

సైదాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్‌లో పూసల సంఘం నేత పసుపులేటి అమరనాథ్ ఆధ్వర్యంలో ఘటాల ఉరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూసల బస్తీ, కుర్మబస్తీ నుంచి ఏకలవ్యనగర్‌రెడ్డి బస్తీ మీదుగా ఘటాల ఊరేగింపు సాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు జంగం మధుకర్ రెడ్డి, రమణ్‌సింగ్, పూసల సంఘం నేతలు వెంకటశర్మ, చక్రధర్ పాల్గొన్నారు.

బీసీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో 42శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి, వెంటనే 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సైదులు యాదవ్, బీసీఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



ఇన్నర్ రింగ్‌రోడ్‌లోని జిల్లెలగూడ గాయత్రీనగర్ బస్టాపు ఎదుట ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు

బస్సులు ఆగేదెట్టా..?

బస్టాపుల వద్ద చిరు వ్యాపారుల తిష్ట

పట్టించుకోని పోలీసులు, మునిసిపల్ అధికారులు

సరూర్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇన్నర్ రింగ్‌రోడ్డులోని పలు బస్టాపులు తోపుడు బండ్లకు అడ్డాగా మారాయి. ఎక్కడైనా రోడ్డు పక్కన వ్యాపారం చేసుకుంటే పర్వాలేదు కానీ.. ఇక్కడ మాత్రం పలువురు వ్యాపారులు తమ తోపుడు బండ్లను ఏకంగా బస్‌షెల్టర్ల ముందే పెట్టేస్తున్నారు. దీంతో అక్కడ ఆర్టీసీ బస్సులు ఆపడానికి స్థలం లేని పరిస్థితి ఏర్పడింది. ఇన్నర్ రింగ్‌రోడ్డులోని టీకేఆర్ కమాన్, గాయత్రీనగర్, మంద మల్లమ్మ చౌరస్తా బస్టాపుల్లో ఈ పరిస్థితి నెలకొంది. దీనిపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కనిపించని ఆర్టీసీ గార్డులు..

ప్రధాన బస్టాపుల్లో ఓ వైపు తోపుడు బండ్లు, మరోవైపు ఆటోలు అడ్డదిడ్డంగా పెడుతున్నా సంబంధిత ఆర్టీసీ గార్డులు, ట్రాఫిక్ పోలీసులు, సివిల్ పోలీసులు, మీర్‌పేట్ మునిసిపల్ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ రూట్ నిత్యం బిజీగా ఉంటుందన్న సంగతి ఆయా విభాగాల అధికారులందరికీ తెలుసు.. అయినా రోడ్లపై, బస్టాపుల్లో అక్రమ పార్కింగ్‌ను, అక్రమ వ్యాపారాన్ని అడ్డుకోవడం లేదు. తోపుడు బండ్ల వ్యాపారుల నుంచి, ఆటోవాలాల నుంచి రోజువారీ మామూళ్లు తీసుకుని, ఆయా విభాగాల అధికారులు కొందరు వారికి పరోక్షంగా అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇన్నర్ రింగ్ రోడ్డులోని సాగర్ క్రాస్ రోడ్డు(బైరామల్‌గూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం) నుంచి పిసల్‌బండ వరకు గల బస్టాపుల్లో అక్రమ పార్కింగ్‌ను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

ఫుడ్ పాయిజన్ బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

వనస్థలిపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ పాయిజన్‌తో బాధపడుతూ చింతలకుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. బోనాల పండుగకు తెచ్చుకున్న మాంసం ఫ్రిజ్‌లో దాచుకుని తిని ఇంటి యజమాని శ్రీనివాస్ యాదవ్ మృతి చెందగా, ఇతర కుటుంబ సభ్యులు అస్వస్థతకు గురికావడం బాధాకరమన్నారు. ప్రస్తుతం ఏడుగురి ఆరోగ్యం నిలకడగా ఉందని, మరో ఇద్దరి పరిస్థితి రెండు, మూడు రోజుల్లో మెరుగుపడుతుందని ఆస్పత్రి వైద్యులు తెలిపారని ఎమ్మెల్యే చెప్పారు. దేవుడి దయతో అందరూ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం డీఎంహెచ్‌వోతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. ఫుడ్ పాయిజన్ బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి తగు న్యాయం చేయాలని ఎమ్మెల్యే డీఎంహెచ్ఓను కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



ఫుడ్ పాయిజన్ బాధితునితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సేఫ్టీ కిట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● సరూర్‌నగర్ సర్కిల్ డీసీ సుజాత

కొత్తపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు సేఫ్టీ కిట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ డీసీ సుజాత, కార్పొరేటర్ పవన్‌కుమార్ సూచించారు. కొత్తపేట డివిజన్‌లోని సీటీఓ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం పారిశుధ్య కార్మికులకు సేఫ్టీ కిట్స్ పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ, ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు పారిశుధ్య కార్మికులు నిరంతరం శ్రమిస్తూ చెత్తను తొలగిస్తున్నారని అన్నారు. ప్రజలు కూడా కార్మికులకు సహకరించాలని వారు కోరారు. కార్మికుల ఆరోగ్య సంరక్షణకు సేఫ్టీ కిట్స్ ఉపయోగపడతాయని వారు అన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య విభాగం డీఈ చందనాచౌహాన్, ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య, సిబ్బంది వినోద్, ప్రేమ్, అఖిల్, శివ, పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు సేఫ్టీ కిట్స్ పంపిణీ చేస్తున్న డీసీ సుజాత, కార్పొరేటర్ పవన్‌కుమార్

పారిశుధ్య కార్మికులకు పీపీఈ కిట్ల పంపిణీ

చాదర్‌ఘాట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ బస్టాపు వద్ద పారిశుధ్య కార్మికులకు జీహెచ్ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ డీసీ సుజాత, కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి బుధవారం పీపీఈ కిట్లను పంపిణీ చేశారు. నిరంతరం ప్రజల కోసం శ్రమించే పారిశుధ్య కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత అందరిదని వారు అన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ డీఈ చందన, సూపర్‌వైజర్ బుచ్చయ్య, ఎస్ఎఫ్ఏలు పాండు, యాకయ్య, సాయి పాల్గొన్నారు.

సాహిత్యంతో సామాజిక ప్రయోజనం

● తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి

ఉప్పల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సాహిత్యంతో సామాజిక ప్రయోజనం ఉంటుందని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలచారి పేర్కొన్నారు. మహాకవి దాశరథి కృష్ణమాచార్య శత జయంతిని పురస్కరించుకుని బుధవారం తెలంగాణ సాహిత్య అకాడమీ, ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో 'అక్షర శరథి దాశరథి - దాశరథి సాహిత్య సమాలోచన అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కాశీం మాట్లాడారు. అక్షరాన్ని అగ్నిధారగా మలచుకున్న మహాకవి దాశరథి అని కీర్తించారు. ఈ సదస్సుకు అధ్యక్షులుగా డాక్టర్ ఎస్.రఘు(ఓయూ), డాక్టర్ బాశెట్టి లత (హెచ్‌సీయూ), డాక్టర్ కోయి కోటేశ్వర రావు(సిటీ కళాశాల) వ్యవహరించారు. ఈ జాతీయ సదస్సులో హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు డా.పిల్లలమర్రి రాములు, తెలంగాణ భాషా చైతన్య సమితి సంపాదకుడు డా. జయప్రకాష్, అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు డా.రజని, ఉప్పల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.విజయ్‌కుమార్, పలువురు కవులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కాశీం



మలక్‌పేటలో నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వల్లీలా ఖాద్రీ, కార్యదర్శి దర్మేంద్ర



చాదర్‌ఘాట్: ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

విద్యాసంస్థల బంద్ విజయవంతం

ఎల్బీనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. సరూర్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్, ఎల్బీనగర్, కర్మన్‌ఘాట్ తదితర ప్రాంతాలలోని పాఠశాలలను విద్యార్థి సంఘాల నాయకులు మూసివేయించారు. ఈ సంద్భంగా ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతికుమార్, ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ, ప్రభుత్వాలు మారినప్పటికీ విద్యా రంగంలో సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రైవేట్‌లో ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎన్ఈపీ 2020 రద్దు చేస్తు అసెంబ్లీలో తీర్మానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సరూర్‌నగర్ మండల కార్యదర్శి వినోద్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు అభిలాష్, మిథున్, విక్రమ్, తరుణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్, మలక్‌పేటలలో...

సైదాబాద్: సైదాబాద్, అక్బర్‌బాగ్, మలక్‌పేట, మాదన్నపేటలలో విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వల్లీలా ఖాద్రీ, కార్యదర్శి కల్లు దర్మేంద్ర, ఉపాధ్యక్షుడు శ్రీమాన్, నగర కార్యదర్శి శ్రీకాంత్, హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, శ్రీనివాస్, వంశీ, అరుణ్ పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్, ఎస్ఎఫ్ఐ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు వంశీ, మండల కార్యదర్శి ఫారుక్ పాషా, సాయి, హరీష్, సూర్య, శివ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్: వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం హయత్‌నగర్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలను ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు మూసివేయించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి అరుణ్‌కుమార్‌గౌడ్, ఎస్ఎఫ్ఐ వంశీ, విద్యార్థి సంఘం నాయకులు సాయి, ఉపేందర్, గణేష్, లక్ష్మణ్, ప్రసన్న, రవితేజ పాల్గొన్నారు.

చాదర్‌ఘాట్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం బుధవారం తలపెట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని పీడీఎస్‌యూ రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల అధ్యక్షుడు మందుల సైదులు తెలిపారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి తెలంగాణ రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడించేందుకు చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. సైదులుతో పాటు పలువురిని పోలీసులు అరెస్టు చేసి ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ మీర్‌పేట్-2 కార్యవర్గం ఎన్నిక

సరూర్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మీర్‌పేట్ కార్పొరేషన్ క్లస్టర్-2 కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముఖేశ్‌కుమార్ ముదిరాజ్ కుమార్ ఎన్నిక కాగా.. ఉపాధ్యక్షులుగా దామోదర్‌రెడ్డి, కృష్ణ, సుధాకర్‌నేత, జగన్‌ముదిరాజ్, ప్రధాన కార్యదర్శులుగా వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, కార్యదర్శులుగా నగేశ్‌యాదవ్, సుభాష్‌గౌడ్, మాచర్ల లక్ష్మి, లావణ్య, కోశాధికారిగా లీలావతి ఎన్నికయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ ఆమోదంతో ఈ కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని మీర్‌పేట్ కార్పొరేషన్ క్లస్టర్-2 నూతన అధ్యక్షుడు ముఖేశ్ తెలిపారు. తెలంగాణలో బీజేపీ జెండా ఎగిరేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖేశ్ నూతన కార్యవర్గ సభ్యులకు సూచించారు.



నాయబ్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న యూఎస్‌పీసీ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

● నాయబ్ తహసీల్దార్‌కు యూఎస్‌పీసీ వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు బింగి రాములయ్య కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్. సురేష్, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును సన్మానిస్తున్న పార్టీ రాష్ట్ర నాయకుడు శంకర్‌రెడ్డి తదితరులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి 'కొలన్' సన్మానం

సరూర్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రామచందర్‌రావును బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన బీజేపీ నాయకులు ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామచందర్‌రావును శాలువాతో సత్కరించి పూలబొకే అందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి, పార్టీ నాయకులు శేఖర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మల్లేశ్‌ముదిరాజ్, ప్రభాకర్‌రెడ్డి, నరేంద్రాచారి, జనార్ధన్, నరేశ్, నవీన్‌కుమార్, లోకేశ్ తదితరులు రామచందర్‌రావును ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి బొకే అందజేసి అభినందనలు తెలియజేశారు.



తిలక్, ఆజాద్‌ల చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు

తిలక్, చంద్రశేఖర్ సేవలు మరువలేనివి

● బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

మన్సూరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌ల సేవలు మరువలేనివని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. తిలక్, ఆజాద్‌ల జయంతిని పురస్కరించుకుని బుధవారం మన్సూరాబాద్ డివిజన్‌లోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్యం కోసం బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌లు వీరోచిత పోరాటం చేశారని, చివరకు ప్రాణ త్యాగానికి కూడా వెనుకాడలేదని గుర్తు చేశారు. తిలక్, ఆజాద్‌ను స్ఫూర్తిగా తీసుకుని నేటి యువతరం ముందుకు సాగాలన్నారు. బీజేపీ జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్ వంగా మధుసూదర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రవీందర్‌గౌడ్, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గీతారెడ్డి, నాగ పరిమిల, చల్లా గీతారెడ్డి, మన్సూరాబాద్ పార్టీ అధ్యక్షుడు హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగి అదృశ్యం

సైదాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అధికారికి టాబ్లెట్ ఇచ్చి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఆర్టీసీ ఉద్యోగి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మాదన్నపేట పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. మాదన్నపేటలో నివాసముండే కాళిదాసు (57) ఆర్టీసీ భవన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మద్యం సేవించే అలవాటు ఉండడంతో భార్యభర్తల మధ్య గొడవలు జరిగేవి. నాలుగు నెలల క్రితం తల్లితో కలిసి అదే ఇంట్లో భార్యాభర్తలు విడిగా ఉంటున్నారు. ఈ నెల 14న అధికారిని కలిసి టాబ్లెట్ ఇచ్చివస్తానని తల్లికి చెప్పి ఫోన్ ఇంట్లోనే ఉంచి బయటకు వెళ్లాడు. రోజులు గడుస్తున్నా అచూకీ లభ్యం కాకపోవడంతో భార్య ధనలక్ష్మి మాదన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు: ఆసీఫ్

సంతోష్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం తాగి వాహనాలు నడపరాదని సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ ఆసీఫ్ వాహనదారులకు సూచించారు. ట్రాఫిక్ ఉన్నతాధికారుల సూచన మేరకు ఐఎస్ సదన్ జంక్షన్ వద్ద బుధవారం ట్రాఫిక్ సిబ్బందితో కలిసి సీఐ పగటిపూట ఆకస్మిక డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు, తప్పని సరిగా పాటించాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ ధరించాలని సీఐ సూచించారు.